సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. సోమవారం ఆయన నియోజకవర్గంలోని పలువురు అర్హులైన లబ్ధిదారులకు 21 కల్యాణలక్ష్మి, 17 షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంతో బాధపడుతున్న వారు సంక్షేమ పథకాలను పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో తలాబ్‌చంచలం, మొఘల్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, మజ్లిస్ పార్టీ నాయకులు, బండ్లగూడ తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

గోల్కొండ కోట బోనాలకు ఎమ్మెల్యే కౌసర్‌కు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: గోల్కొండ కోట బోనాల నిర్వహణకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గోల్కొండ కోట బోనాల ఆహ్వాన పత్రికను సోమవారం జగదాంబిక మహంకాళి అమ్మవార్ల వృత్తిపని సంఘం వారు సోమవారం ఆయనను సన్మానించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల నిర్వహణకు మజ్లిస్ పార్టీ పూర్తి సహాయ సహకారాలను అందిస్తు వస్తుందన్నారు. బోనాల విషయంపై తాను ఈ పాటికే పోలీసులు, ట్రాఫిక్, బల్దియా, జలమండలి అధికారులతో మాట్లాడానన్నారు. మొదటి బోనం జూలై 7న ప్రారంభం అవుతుందని, అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, మహంకాళి ఆలయ పూజారి సురేష్‌చారి తదితరులున్నారు.

ఘనంగా రేణుకా మాత ఉత్సవాలు


పలువురిని సన్మానిస్తున్న ఎస్ఎస్‌కే వర్కింగ్ ప్రెసిడెంట్ నగరి లక్ష్మీనారాయణ్

జియాగూడ: ప్రతి యేటా మాతేశ్వరీ ఉత్సవాల్లో భాగంగా సమాజ్ ప్రతినిధులను సన్మానించి గౌరవించడం జరుగుతుందని హైదరాబాద్ ఎస్ఎస్‌కే సమాజ్ వర్కింగ్ యాక్టింగ్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ నగరి లక్ష్మీనారాయణ్ అన్నారు. సోమవారం అల్లాదుర్గ్‌లోని శీలంకోట్ రేణుకా మాత ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎస్ఎస్‌కే సమాజ్ ప్రతినిధులను ఆయన సన్మానించారు. ముఖ్య సలహాదారులు పూజారి రాజేశ్వర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు నగరి సురేందర్, లీగల్ అడ్వైజర్ తురేరావు లక్ష్మీకాంత్, మద్రాస్ ఎస్ఎస్‌కే సమాజ్ ప్రతినిధి కంద స్వామి, మ్యాక్ట్ సొసైటీ ప్రతినిధి గణేష్ పవార్, రాజ, అనిల్‌రెడ్డి, రతన్ మహేష్, పెందు నర్సింగ్ పాల్గొన్నారు.

‘డీఎస్సీలో షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు తీవ్ర అన్యాయం’


గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలను స్థానిక గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మాసాబ్‌ట్యాంక్ వద్ద గల సంక్షేమ భవనంలోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు డీఎస్సీలో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్టీ ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు, లావణి భూములకు పట్టాలు ఇచ్చి శాశ్వత పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు రాజేష్‌నాయక్, జాదవ్‌సోమేష్, సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షులు రాంబాబునాయక్, ఆదివాసీ విద్యార్థి సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రకాష్ దొర, ధర్మా నాయక్, భూక్యకుమార్, వి.రమేష్, ప్రకాష్ రాథోడ్, గోవింద్‌నాయక్ తదితరులున్నారు.

చాచా నెహ్రూ పార్కును సందర్శించిన జోనల్ కమిషనర్


కొలను నిర్వహణను పరిశీలిస్తున్న జడ్‌సీ అనురాగ్ జయంతి

నాంపల్లి: మెహిదీపట్నం సర్కిల్–12 పరిధిలోని మాసాబ్‌ట్యాంక్ చాచా నెహ్రూ పార్కును సోమవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సందర్శించారు. ఆయన జీహెచ్ఎంసీ, ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి పార్కును మొత్తం కలియతిరిగారు. పార్కులో సందర్శకులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, వాకింగ్ లేన్, చిల్డ్రన్స్ పార్కు, వాటర్ కొలను, వాటర్ ఫౌంటెన్లు, క్యాంటీన్ నిర్వహణ, మరుగుదొడ్ల పనితీరుపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు. మరుగుదొడ్ల సమస్య ఉందంటూ అక్కడి సిబ్బంది జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. మెహిదీపట్నం సర్కిల్–12 డిప్యూటీ కమిషనర్ సీహెచ్.నాగేశ్వరావు, ఏఎంహెచ్ఓ విజయ్ రామ్మోహన్ రావు, ఏఈ ముషారఫ్, ఇతర ఉద్యానవన శాఖ అధికారులు జోనల్ కమిషనర్ ఉన్నారు.

6న మహంకాళేశ్వరి మహాభిషేకం



చార్మినార్: మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయంలో ఈనెల 6న మహంకాళేశ్వరి అమ్మవారికి మహాభిషేకం పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడానికి నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని పసుపు, కుంకుమలతో పాటు అష్టోత్తర సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించ నున్నారు. అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయ ఆచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మహాభిషేకం పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. మహాభిషేకాన్ని పురస్కరించుకొని భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటు న్నామన్నారు. లోక కల్యాణార్థం మహంకాళేశ్వర పరివార సహిత మహంకాళేశ్వరి మహాభిషేకం పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు.

‘స్వస్తిక్’ ఫౌండేషన్ డే



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ స్వస్తిక్ మిర్చి ఫౌండేషన్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సంస్థ సామాజిక సేవలో భాగంగా చదువులో ప్రతిభ చూపిన ఉద్యోగుల పిల్లలకు దాంజీ జీవరాజ్‌నంద పేరిట ఉపకార వేతనాలను ప్రకటించింది. ఇందుకు ఎంపికైన 11 మంది పిల్లలకు ఆదివారం బేగంబజార్‌లోని తన సంస్థలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో అందజేసింది.

గోర్ బోలి భాషను రాజ్యాంగంలో చేర్చాలి



గన్‌ఫౌండ్రీ: గోర్ బోలి భాషను రాజ్యాంగంలో చేర్పించాలనే ప్రతిపాదనను, భాష గుర్తింపు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అన్నారు. రవీంద్రభారతిలో లంబాడ హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ గోర్ బంజారా సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భాగ్యనగరంలో సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ మంత్రి రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. తండా గిరిజన పంచాయితీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. గిరిజనులంతా ఐక్యంగా ఉండాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత రమేష్ నాయక్, వివిధ రంగాల్లో రాణిస్తున్న గిరిజన ప్రముఖులను సన్మానించారు. ఎమ్మెల్యే బాలునాయక్, ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యులు హుస్సేన్ నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ మజహరుల్లా తదితరులు


యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న దృశ్యం


ప్రొ. డాక్టర్ సర్జీవ్ సింగ్‌యాదవ్‌ను సత్కరిస్తున్న కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్ తదితరులు

గోల్కొండ: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమ వారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరిండెంటెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా తోటి వైద్యులతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ అప్పట్లో ప్రఖ్యాంతి గాంచిన వైద్యుడన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినాయక్‌రావు, శ్రీనివాసరావు, డాక్టర్ గోపాల్, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు ఎంతో అమోఘం

అబిడ్స్: సమాజ సంక్షేమానికి వైద్యులు చేస్తున్న కృషి ఎంతో అమోఘమని కార్వాన్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం డాక్టర్ శ్రీకాంత్‌ను స్థానిక బస్తీవాసులు, వైద్య సిబ్బంది, మెడికల్ సిబ్బంది ఘనంగా సత్కరించి జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు.

మానవాళి మనుగడకు వైద్యుల సేవలు అమోఘం

అఫ్జల్‌గంజ్: మానవాళి మనుగడకు వైద్యులు చేస్తున్న సేవలు అమోఘమని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్ పేర్కొన్నారు. ఉస్మానియా డెంటల్ కళాశాల ఆసుపత్రిలో వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉస్మానియా డెంటల్ ఆసుపత్రిలో సేవలందిస్తున్న సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోయిన రామకృష్ణ శాస్త్రి, ఠాకూర్ గణేష్ సింగ్ పాల్గొన్నారు.

వైద్యులు ప్రజల జీవితాలను కాపాడే హీరోలు..


డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్

అఫ్జల్‌గంజ్: ప్రజల జీవితాలను కాపాడే హీరోలు వైద్యులని ఫెర్నాండేజ్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, ఫెర్నాండేజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ పేర్కొన్నారు. వైద్యరంగంలో వైద్యులు చేస్తున్న విధులు ఎంతో అమోఘమన్నారు. అబిడ్స్‌లోని ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..వైద్యులంతా తమ కుటుంబాలకు దూరంగా ఉండి వైద్య వృత్తిని కొనసాగిస్తారన్నారు.

వైద్య వృత్తి ఎంతో విలువైంది: డాక్టర్ సుప్రియ మరిపల్లి


డాక్టర్ సుప్రియ మరిపల్లి, డాక్టర్ అమిత్ గోయల్, ఇతర డాక్టర్లను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ కేసీజీఎఫ్ ప్రతినిధులు

అబిడ్స్: వైద్య వృత్తి సమాజంలో ఎంతో విలువైందని ప్రముఖ గైనకాలజిస్ట్, సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ సుప్రియ మరిపల్లి పేర్కొన్నారు. వాసవీక్లబ్ కేసీజీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ సుప్రియ మరిపల్లితో పాటు డాక్టర్ అమిత్ గోయల్, ఇతర డాక్టర్లను సత్కరించి డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రియ మరిపల్లి మాట్లాడుతూ.. వైద్యోనారాయణ హరి అని వైద్యులకు ప్రజలు ఎంతో గొప్పగా ఆరాధిస్తారన్నారు. ఇలాంటి దైవంతో సమానం ఉన్న వైద్య వృత్తిని విజయవంతంగా అందరికీ సేవలందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ కేసీజీఎఫ్ అధ్యక్షుడు గోపిశెట్టి గౌరిశంకర్, కార్యదర్శి మన్నాన్‌పల్లి అమర్నాథ్, కోశాధికారి ఎర్రం రాములు, డిస్ట్రిక్ ఇన్‌చార్జి మంచికంటి ప్రకాష్, రాయకంటి రాజేశ్వర్‌రావు, రాష్ట్ర ఆర్ఎస్ఎస్ వీహెచ్‌పీ ప్రతినిధి ఆనంద్ మరిపల్లి పాల్గొన్నారు.

ఉరివేసుకొని బ్యాంకు అటెండర్ ఆత్మహత్య


ఓంకార్ శేఖర్ (ఫైల్)

అబిడ్స్: హైదరాబాద్ జిల్లా సహకార బ్యాంకులో అటెండర్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాంపల్లి సహకార సంఘం కార్యాలయంలో చోటుచేసుకుంది. 194 బీఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం.. ఎస్ఐ గౌరేందర్‌గౌడ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులోని జిల్లా సహకార బ్యాంకులో అటెండర్‌గా పనిచేస్తున్న ఓంకార్ శేఖర్ (29) రోజు మాదిరిగానే సోమవారం ఉదయం 10.30 గంటలకు విధులకు హాజరయ్యాడు. ఉదయం 11.30 గంటలకు టాయిలెట్ కోసం వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో బ్యాంకు వాచ్‌మెన్‌కు అనుమానం వచ్చి టాయిలెట్ రూమ్‌కి వెళ్లి పరిశీలించగా అక్కడ అతను కనిపించలేదు. పక్కనే ఉన్న వాష్‌రూమ్‌లో ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే అతడిని సిబ్బంది, అబిడ్స్ పోలీసులు సమీపంలో ఉన్న నాంపల్లి కేర్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కొత్త చట్ట ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

అబిడ్స్: ఉద్యోగ అర్హత పరీక్ష కోసం నగరానికి వచ్చిన ఓ యువతి లాడ్జి గదిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 194 బీఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం..ఎస్ఐ గౌరేందర్‌గౌడ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బెంగళూర్‌కు చెందిన ఇందూరాణి(31) నగరంలోని ఉద్యోగ అర్హత పరీక్ష రాసేందుకు ఆదివారం బెంగళూర్ నుంచి వచ్చి నగరంలోని అబిడ్స్ రామకృష్ణ థియేటర్ ఎదురుగా ఉన్న తులసి లాడ్జిలో గది తీసుకుంది. సోమవారం ఉదయం 11.30 గంటల వరకు కూడా ఆమె గది తలుపులు తెరువక పోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది తలుపులు తట్టినా అలికిడి లేదు. దీంతో అబిడ్స్ పోలీసులకు సమాచారం ఇవ్వగా లాడ్జీ గది తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా బెడ్‌పై ఆమె మృతిచెంది కనిపించింది. బెడ్ పక్కనే పురుగుల మందు సీసా లభించింది. ఆమె వద్ద లభించిన డైరీ ఆధారంగా బెంగళూర్‌లో ఉన్న కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

సుల్తాన్‌బజార్: కారు ఢీకొని ఓ మహిళకు గాయాలయిన ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిది. 125 బీఎన్ఎస్ క్రైమ్ నెంబర్: 173/2024 చట్టం ప్రకారం..మధ్యాహ్నం 2 గంటలకు ఈ కేసు నమోదు అయ్యింది. సంబంధిత వివరాల ప్రకారం... ఎల్బీనగర్‌కు చెందిన దివ్య(29) ఉదయం 10.40 గంటలకు రాంకోఠి నుంచి సుల్తాన్‌బజార్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుంది. అదే ప్రాంతంలో ఓ కారు ఆమెను ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం సైతం ధ్వంసం కావడంతో స్థానికుల సాయంతో ఆమె సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముఖేష్ గౌడ్ సేవలు చిరస్మరణీయం


వేడుకల్లో శ్రీకాంత్ యాదవ్ తదితరులు

సుల్తాన్‌బజార్: మాజీ మంత్రి ఎం.ముఖేష్‌గౌడ్ సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీకాంత్ యాదవ్ అన్నారు. మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ జయంతిని పురస్కరించుకుని జాంబాగ్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ముఖేష్‌గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ..మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ బీసీలకు ఎంతో మేలు చేశారన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో మంత్రిగా ఆయన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, పాండు, ఆశీష్, రమేష్, శేఖర్, సత్యం, టిల్లు పాల్గొన్నారు.

కష్టపడే వారికి ఉజ్వల భవిష్యత్: వెంకయ్యనాయుడు


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలిసిన బీజేపీ నాయకులు

గోల్కొండ: కష్టపడే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మాజీ భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా సోమవారం బీజేపీ నాయకుడు దేవర వంశీ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం ఉత్తమ సాంప్రదాయాలు, గొప్ప సంస్కృతి గల దేశం అని అన్నారు. అందరు కలిసికట్టుగా పని చేస్తేనే దేశం ఇంతలా అభివృద్ధి చెందిందని ఆయన అన్నారు.

సన్మానం


కొమరయ్యను సత్కరిస్తున్న డీసీ సరిత

శాలిబండ: చార్మినార్ సర్కిల్‌లో శానిటరీ జవాన్‌గా పని చేస్తున్న కొమరయ్య సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా చార్మినార్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ ఎల్.సరితతో పాటు ఉద్యోగులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ..కొమరయ్యలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతిబాయి, ఎస్ఎస్ దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఏ ధర్మేందర్ పాల్గొన్నారు.

నేరాల అదుపునకు ముస్లిం మత పెద్దల ప్రత్యేక సమావేశం

చార్మినార్: వరుసగా జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలను నివారించడానికి అవసరమైన అన్ని ప్రాంతాల్లోని యువకులకు అవగాహన కల్పించేందుకు ముస్లిం మత పెద్దలు సోమవారం పాతబస్తీ దారుషిఫా లోని ఓ మసీదులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్షణికావేశానికి లోనవుతున్న యువకులు హత్యలకు పాల్పడుతున్నారని..తదనంతరం జరిగే పరిణామాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదన్నారు.

హత్యకు గురైన కుటుంబంతో పాటు హత్య చేసిన కుటుంబాలు సైతం రోడ్డున పడే పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ మత పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా వీటిని అరికట్టడానికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. చెడు వ్యసనాలకు బానిసవుతున్న యువకులు నేరాలకు పాల్పడుతున్నారనే విషయాన్ని మత పెద్దలు స్పష్టంగా చర్చించారు. అమీరే మిల్లత్ ఇస్లామియా అధ్యక్షులు హజ్రత్ మౌలానా మహమ్మద్ హమీదుద్దీన్ సాని అఖిల్ జాఫర్ పాషా ఆధ్వర్యంలో ఈ ముస్లిం మత పెద్దల సమావేశం జరిగినట్లు సమాచారం.

ఇద్దరు మహిళలపై లైంగిక దాడి.. యువకుడికి రిమాండ్

సుల్తాన్‌బజార్: ఇద్దరు మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని సుల్తాన్‌బజార్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పర్‌పల్లి, లింగంపల్లి, మక్తల్ ప్రాంతానికి చెందిన చాంద్ పాషా(26) ఇస్సామియాబజార్‌లో కూలీ పని చేస్తుంటాడు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలతో లైంగిక సంబంధం పెట్టుకొని వారిపై లైంగిక దాడికి పాల్పడి పరారీలో ఉన్నాడు. మూడేళ్ల కిందట ఒకరిపై, మూడేళ్ల క్రితం మరొకరిపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆ మహిళల తండ్రి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ క్రింద కేసు నమోదు చేసుకున్న మల్కాజ్‌గిరి పోలీసులు సుల్తాన్‌బజార్ పోలీసులకు ఈ కేసును అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు చాంద్ పాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉర్సు ఉత్సవాలకు బాగ్దాదీ దర్గా ముస్తాబు

- 3వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 4న ప్రధాన సందల్ సమర్పణ
- ఏర్పాట్లను పూర్తి చేసిన నిర్వాహకులు


ఉత్సవాలకు ముస్తాబయిన దర్గా


దర్గా ప్రాంగణంలో బావి

లంగర్‌హౌస్: చారిత్రాత్మక దర్గా ఉర్సు–ఇ–షరీఫ్ ఉత్సవాలకు ముస్తాబయ్యింది. 396వ ఉర్సు–ఇ–షరీఫ్ ఉత్సవాలు జూలై 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సంవత్సరం కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. ప్రధాన సందల్ సమర్పణ కార్యక్రమం జూలై 4న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. లంగర్‌హౌస్‌లోని దర్గా ఈ హజ్రత్ సయ్యద్ షా మీరన్ హుస్సేని బాగ్దాదీ ఖాద్రీ దర్గాలో ఉర్సు–ఇ–షరీఫ్ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు 396వ ఉర్సు–ఇ–షరీఫ్ ఉత్సవాలు నిర్వహించనున్నారు. దర్గా మోతావలి సజ్జదీ నషీన్ అల్ హజ్ సయ్యద్ షా ఫఖీర్ మొహమ్మద్ ఖాద్రీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా చట్టుపక్కల రాష్ట్రాల నుంచి పెద్దయెత్తున భక్తులు ఇప్పటికే ఇక్కడికి చేరుకుంటుండటంతో పండుగ వాతావరణం నెలకొంది. మంత్రులు, ప్రముఖులు కూడా దర్గాను దర్శించి సందల్ సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు.

బావి నీటి మహిమ..

కుతుబ్‌షాహీల కాలంలో నిర్మించిన ఈ దర్గా ద్వారాన్ని ఆనుకొనే ఓ పెద్ద పురాతన బావి ఉంది. ఈ బావి నీటిని 5 శుక్రవారాలు తాగిన, ఈ నీటితో 5 శుక్రవారాలు స్నానం చేసి దర్గాను దర్శిస్తే భయంకర రోగాలు సైతం దూరమవుతాయని భక్తుల నమ్మకం. ఉర్సు–ఇ–షరీఫ్ ఉత్సవాల్లో బావి నీటికి మరింత మహిమ ఉంటుందని పురాణాల్లో చెబుతున్నారు. ముస్లింలతో పాటు హిందువులు, సిక్కులు వివిధ మతస్తులు ఈ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుంటుంటారు. దర్గా నిర్వాహకులు ప్రధాన మోతవలి ఆధ్వర్యంలో ముఖ్య టుర్బట్ షరీఫ్‌లో, పరిసర ప్రాంతాల్లో ఘుల్–ఇ–షరీఫ్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా దర్గాను సుగంధ ద్రవ్యాలతో శుభ్రపరుస్తారు.

ప్రధాన కార్యక్రమాలు..

జులై 3న దర్గా ఉర్సు–ఇ–షరీఫ్ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు సాయంత్రం 6:30 గంటల నుంచి ప్రధాన దర్గాలో ఘుస్ల్–ఇ–షరీఫ్, సుగంధ ద్రవ్యాలతో దర్గా శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 4వ తేదీన సాయంత్రం ప్రధాన ఘట్టం ప్రారంభమవుతుంది. కార్వాన్‌లోని సజ్జద్–ఇ–నషీన్ గృహం నుంచి పవిత్ర సందల్‌ను భారీ ర్యాలీలు, ఆటపాటలతో ఊరేగింపుగా లంగర్‌హౌస్ దర్గాకు తీసుకొచ్చి ప్రధాన దర్గాలో సందల్ సమర్పించనున్నారు. మంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సందల్ సమర్పిస్తారు. 5వ తేదీన ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఉర్సు చిరాగహన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. మీలద్ అనంతరం ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు పెద్దయెత్తున నిర్వహించనున్నారు. రాత్రంతా జాగరణ, పంఖస్ మరియు ఫిలాఫ్–ఇ–ముబారక్ కార్యక్రమాలు ఉంటాయి. 6వ తేదీన ఉర్సు ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి. ఉదయం 8 గంటలకు ఖత్మే–ఖురాన్ షరీఫ్, 10 గంటల నుంచి అన్నదానం, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాంస్కృతిక ఖవ్వాలీ, ఖుల్ కార్యక్రమాలతో ఉర్స్ ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దర్గా నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేక బస్సులు..

ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లుగా ఈ సంవత్సరం కూడా ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుందని నిర్వాహకులు తెలిపారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ ఆర్టీసీ బస్సుల కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. పాతబస్తీతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు.